క్లుప్తంగా

వైఎస్సార్ బీమా కొండంత అండ



బీమా మంజూరు పత్రాలు అందజేస్తున్న నగర పంచాయతీ చైర్మన్, కమిషనర్

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ బీమా ప్రమాద సమయంలో బాధితుల కుటుంబాలకు కొండంత అండగా ఉంటుందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన దూదేకుల దస్తగిరి ట్రాక్టర్ ప్రమాదంలో గతనెల 21న మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ ప్రమాద బీమా కింద రూ. 5లక్షలు మంజూరైంది. ఈ మేరకు బుధవారం మృతుడి భార్య వన్నూర్‌బీకి బీమా మంజూరు పత్రాలను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు అందజేశారు.

తపాలా శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల: ఖాతాదారుల శ్రేయస్సే ధ్యేయంగా తపాలా శాఖ ప్రవేశ పెట్టిన సేవింగ్, సుకన్య సమృద్ధి, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఈస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ స్వామినాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలో తపాలా శాఖ ప్రవేశ పెట్టిన కొత్త పథకాలపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోస్టు మాస్టర్లు నరసింహులు, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, శివశంకర్, రమేష్, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న దృశ్యం

డోన్ : పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప వరం లాంటిదని కౌన్సిలర్ టమటం దినేష్‌గౌడ్ అన్నారు. 13వ వార్డుకు చెందిన లక్ష్మి అనే మహిళకు మంజూరైన రూ.20వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ టమటం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని శాన్వితను అభినందిస్తున్న హెచ్ఎం గీత

కోవెలకుంట్ల: స్థానిక సెయింట్ జోసఫ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థిని శాన్విత జిల్లాస్థాయిలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈ మేరకు బుధవారం శాన్వితను హెచ్ఎం హెచ్ఎం గీతతోపాటు ఫిజికల్ డైరెక్టర్ హర్ష, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–14 సెటిల్ విభాగంలో శాన్విత ప్రతిభ చాటిందని గుర్తు చేశారు.

విద్యార్థుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

బనగానపల్లె : ప్రధానోపాధ్యాయురాలి తీరును తప్పుపడుతూ బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు నిరసన తెలిపారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పాఠశాల ఎదుట నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తమతోపాటు ఉపాధ్యాయులను సైతం హెచ్ఎం కించపరుస్తూ మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా విద్యార్థులు ఆరోపించారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయురాలు జానకిని ఫోన్‌లో సంప్రదించగా ఖండించారు. తాను ఎవరిని కించపరచలేని, ఆరోపణలు అవాస్తవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కొలిమిగుండ్ల: పెట్నికోట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కొప్పుల వెంకట శివారెడ్డి మృతికి పలువురు నాయకులు నివాళులర్పించారు. గుండె వ్యాధితో హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి బుధవారం పెట్నికోటకు చేరుకొని శివారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు పులిప్రకాష్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కొండమీదపల్లెలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని, ఆయా కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు అందజేస్తూ పేదల అభివృద్ధికి అండగా నిలుస్తున్నారన్నారు. బుధవారం సాయంత్రం గొర్విమానుపల్లె, కొండమీదపల్లె గ్రామాల్లో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు జరిగిన లబ్ధిని వివరించి, స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని,జెడ్పీచైర్మన్ మాట్లాడుతు గతంలో ఏ ప్రభుత్వ పాలనలో కూడా ప్రజా ప్రతినిధులు ఇలా ప్రతి ఇంటి వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందాయా?మీ అవసరాలు ఏమిటి అని అడిగిన దాఖలాలు లేవన్నారు. గతంలో ఎన్నికల సమయంలో మాత్రమే చుట్టపు చూపుగా గ్రామాల్లో పర్యటించే వారని గుర్తు చేశారు. ఈరోజు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి గుమ్మం వద్దకు వచ్చి అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధిని ధైర్యంగా చెబుతోందని వివరించారు. అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని పేర్కొన్నారు.

ఎన్నికలప్పుడే టీడీపీకి ప్రజలు గుర్తుకొస్తారు...

ఎన్నికలప్పుడే టీడీపీ నాయకులకు ప్రజలు గుర్తు వస్తారని, ఎనలేని ప్రేమ ఒలకబోస్తారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలు గుప్పించిన చంద్రబాబు నాయుడు, తర్వాత ప్రజలను నిలువునా మోసం చేశారని గుర్తు చేశారు. ఈసారి కూడా అబద్ధపు హామీలు, చేయలేని వాటిని చెబుతే మరోమారు మభ్యపెడుతున్నారన్నారు. ఇప్పటికే గ్రామాల్లో టీడీపీ నాయకులు మేనిఫెస్టో పేరుతో కరపత్రాలు పట్టుకొని మోసగించేందుకు తిరుగుతున్నారని, ప్రజలను మోసగించేందుకు నానా పాట్లు పడుతున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం వేల కోట్లు అప్పు చేసి ఎక్కువ భాగం నిధులు జేబుల్లో వేసుకున్నారని ఆరోపించారు. ఆరువందల అబద్ధాలాడి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేకపోయారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చినవాటితోపాటు ఇవ్వనివి కూడా అమలు చేశారని గుర్తు చేశారు. రెండు ప్రభుత్వాల మధ్య తేడాను గమనించి ప్రజల పక్షాన పని చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు పులి ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, ఉపసర్పంచ్ పుల్లారెడ్డి, నాయకులు బీపీ జగన్, అమర్‌నాథ్, పులి సుదర్శన్‌రెడ్డి, నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామానికి చెందిన ఇరువర్గాలపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ విష్ణునారాయణ తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎరుకలి లక్ష్మీదేవి, ఎరుకలి శ్రీనివాసులుతోపాటు వడ్డే లోకేష్ గృహాలు పక్కపక్కనే ఉంటాయి. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలం విషయంలో తరుచూ గొడవపడుతున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన ఘర్షణలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారు. తనపై ఎరుకలి లక్ష్మీదేవి, ఎరుకలి ప్రేమ్‌కుమార్, ఎరుకలి బృందా, ఎరుకలి శ్రీనివాసులు, ఎరుకలి వెంకటరాముడు దాడి చేశారని వడ్డే లోకేష్ పోలీసులను ఆశ్రయించాడు. తనతోపాటు తల్లి ఎరుకలి లక్ష్మీదేవిని కులం పేరుతో వడ్డే లోకేష్, శ్రీనివాసులు, వడ్డే సత్యనారాయణ, వెంకటనారాయణ, మూరం నర్సిరెడ్డి దూషించారని ఎరుకలి బృంద పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏబీవీపీ శిక్షణా తరగతులను విజయవంతం చేయండి

డోన్ రూరల్ : పట్టణంలో ఈనెల10, 11వ తేదీలలో నిర్వహించే ఏబీవీపీ సైద్ధాంతిక శిక్షణా తరగతులకు విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు రవి, శేఖర్ పిలుపు నిచ్చారు. పట్టణంలో స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు ధనుకుమార్, కృపేంద్ర రెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

‘పల్లెకు పోదాం’ విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి నిర్వహించనున్న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సయ్యదు స్నీసా తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మొదటి రోజు భీమునిపాడు గ్రామ సచివాలయ పరిధిలో, 10వ తేదీన బిజనవేముల, 14న చిన్నకొప్పెర్ల, 15న గుళ్లదూర్తి, 16న కలుగొట్ల గ్రామాల్లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అదేవిధంగా 17న కోవెలకుంట్ల 1వ గ్రామ సచివాలయం, 20న రెండవ, 21న మూడవ, 22న నాల్గవ, 23వ తేదీన కోవెలకుంట్ల 5 గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహిస్తామన్నారు. మండల టీమ్ ఆయా కుటుంబాల ఇళ్ల వద్దకు వెళ్లి ఇప్పటి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు. మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొనాలని సూచించారు.

అవుకు: మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో గురువారం నుంచి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. 9వ తేదీన అన్నవరం, 10న చనుగొండ్ల, 14న చెన్నంపల్లె, 15న చెర్లోపల్లె, 16న గుండ్ల శింగవరం, 17న కొండమనాయునిపల్లె, 20న కునుకుంట్ల, 21న మెట్టుపల్లె, 22న అవుకు–1, 22న అవుకు–2గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను డిస్‌ప్లే చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఎంత డబ్బు ఖర్చు చేసిందనే విషయాలను వివరిస్తారని తెలిపారు. అనంతరం 10 రోజుల పాటు ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు ఎంతమేర లబ్ధి చేకూరిందనే విషయాలను నమోదు చేసుకొని వారి నుంచి ఈ కేవైసీ తీసుకుంటారని ఎంపీడీఓ తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

- మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్న జలదుర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామానికి చెందిన దాదాపు 200 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. బుధవారం ప్యాపిలిలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్, అబ్దుల్ రసూల్, కొండారెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో విశ్వనాథ్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, బంగి మధు, పత్తికొండ రమణ తదితరులతో పాటు 200 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి కార్యకర్తలు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో జలదుర్గం సర్పంచ్ దస్తగిరి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి రాము, ఇమాముద్దీన్, అలేబాదు ప్రవీణ్, రంగస్వామి, కరణం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త విధులపై విచారణ



అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న సీడీపీఓ

బేతంచెర్ల: మండల పరిధిలోని రేపల్లె గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బులక్ష్మి విధి నిర్వహణ సక్రమంగా లేదని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు బుధవారం డోన్ సీడీపీఓ షంషాద్ బేగం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తులతోపాటు గర్భిణులు, బాలింతలను విచారించారు. గ్రామంలో సగం మంది ఆమె పనితీరు సక్రమంగా లేదని ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో ఇచ్చి సంజాయిషీ తీసుకుంటామని సీడీపీఓ తెలిపారు. పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని సీడీపీఓ హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, శోభ, పద్మావతి, పరమేశ్వరి పాల్గొన్నారు.

కారు బోల్తా ముగ్గురికి గాయాలు

డోన్ టౌన్ : స్థానిక జాతీయ రహదారిపై రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడడంతో బుధవారం ముగ్గురికి గాయాలయ్యాయి. బెంగళూరుకు చెందిన డాక్టర్ దిలీఫ్... భార్య అనిత, కుమారుడు అక్నాష్‌తో కలిసి వ్యక్తిగత పనులపై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. రూరల్ పోలీసు స్టేషన్ సమీపం కారు అదుపు తప్పడంతో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిని ప్రథమ చికిత్సల అనంతరం కర్నూలుకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

బంగారం అంగళ్లపై తూనికలు కొలతల అధికారుల దాడులు



బంగారం దుకాణంలో తనిఖీలు చేస్తున్న జిలానీబాషా

డోన్ టౌన్ : తూనికలు కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ జిలానీ బాషా ఆధ్వర్యంలో డోన్ తూనికలు కొలతలశాఖ అధికారి ఖాజా హుస్సేన్ బుధవారం పట్టణంలోని పలు బంగారం దుకాణాలతో పాటు ప్రైవేట్ గోల్డ్ లోన్ సంస్థలపై దాడులు నిర్వహించారు. ఐఐఎఫ్ఎల్ గోల్డ్ లోన్ సంస్థలో ఉన్న కాటాలో వ్యత్యాసాన్ని గుర్తించిన అధికారులు కాటాను సీజ్ చేసి రూ.5వేలు జరిమానా విధించారు. అలాగే పాత బస్టాండ్ సమీపంలోని బింధు, అక్షయ జ్యూవెలరీ షాపులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ముద్ర వేయించుకోక పోవడంతో ఒక్కో దుకాణానికి రూ.10వేల చొప్పున అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది హనుమాన్‌సింగ్, శశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌లోనూ విప్లవాత్మక మార్పులు



కార్డు ఫ్రేమ్ విధానంలో రిజిస్టర్ అయిన పత్రాలను యజమానికి అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్ : వైద్య, విద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌లోనూ కార్డు ఫ్రేమ్ రిజిస్ట్రేషన్ విధానాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ప్రజలు తమ ఆస్తుల రిజిస్ట్రేషన్లను సులభంగా చేసుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త విధానాన్ని తీసుకొచ్చారన్నారు. బుధవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కార్డు ఫ్రేమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లలో మోసాలను నిర్మూలించేందుకు కార్డు ఫ్రేమ్ రిజిస్ట్రేషన్ విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కొత్త విధానాన్ని మొదటగా నంద్యాల, విశాఖపట్టణం, అనకాపల్లి, తిరుపతి జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించామన్నారు. ఈ విధానం విజయవంతం అయితే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునే అకాశం ఉందన్నారు. కార్డు ఫ్రేమ్ రిజిస్ట్రేషన్ విధానంలో తమ ఆస్తులను క్రయ, విక్రయదారులు తమ ఇళ్లలో లేదా గ్రామ సచివాయాల్లో, ఈ సేవా కేంద్రాల్లో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుక్కు చేసుకొని డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేస్తారన్నారు. ఆ తరువాత క్రయ విక్రయాదారులు మరోసరి చెక్ చేసుకొని వారు ఓకే అంటే వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ శ్రీధర్‌గుప్త, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, స్టాంప్‌వెండర్లు రామకృష్ణ, బచ్చుమధుసూదన్, సుబ్బరాయుడు, మల్లేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



బంద్‌లో పాల్గొన్న విద్యార్థులు



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

డోన్ టౌన్ : విశాఖ ఉక్కు పరిశ్రమ పరి రక్షణ, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచే పట్టణంలోని పలు పాఠశాలలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు సహకరించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు రోడ్లపై రాస్తరోకోలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇర్ఫానాబేగం, మండల అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్‌బాషా, అశోక్, డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు హబీబ్‌బాషా, నక్కి హరి తదితరులు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం లాభాల్లో నడుస్తున్న విశాఖ ఉక్కు, ఎల్ఐసీ, రైల్వే తదితర సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపించారు.

కోవెలకుంట్ల: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని ఆపాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకుడు మాబు ఉసేన్ అన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని హామీని తుంగలో తొక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉసేన్‌పీరా, ఉసేన్, మహేష్, సురేష్, అభినందన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

డోన్ రూరల్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కడపలో స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ మేరకు డోన్ పాతబస్టాండ్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల అధ్యక్షుడు పులిశేఖర్ మాట్లాడుతూ 32మంది విద్యార్థులు ప్రాణాలర్పించి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం కేంద్రం ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమైన పని అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్, సీపీఐ పట్టణాధ్యక్షుడు నారయణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పవన్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయ వంతమైంది. ఈసందర్భంగా డీవైఎఫ్ జిల్లా నాయకులు మధు శేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షులు ఉదయ్ మాట్లాడారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలన్నారు.

11న మాదిగల విశ్వరూప సభ



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

బనగానపల్లె రూరల్ : హైదరాబాద్‌లో ఈ నెల 11వ తేదీన నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షులు శివనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలో పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విశ్వరూప సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతారని, సమస్యలుపై చర్చించనున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కత్తి ఓబులేసు, కో కన్వీనర్ చిన్న మునెయ్య, నాయకులు దస్తగిరి, వెంకటకృష్ణయ్య, మోహన్, దస్తగిరి, చంద్ర మోహన్, నాగాంజనేయులు నాగన్న పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభకు తరలిరావాలి

అవుకు: హైదరబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 11న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అవుకు మండల అధ్యక్షుడు సాత్రి రామచంద్రుడు కోరారు. బుధవారం మండల కేంద్రం అవుకుతో పాటు రామాపురం, చెర్లోపల్లె గ్రామాల్లో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి మాదిగ, మిద్దె శ్రీనివాసులు, జయరాముడు, కల్లూరు మద్దిలేటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ఎస్సీ వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని కోరుతూ హైదరాబాదులో ఈనెల 11న మందకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కొలిమిగుండ్లలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యాలయం వద్ద మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్యాపిలి: స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయం ఆవరణలో బుధవారం విశ్వరూప మహాసభల పోస్టర్లను జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల నాగరాజు, నాయ కులు సుందరం, ఆవుల రామకృష్ణ, ఎరుకల కృష్ణమూర్తి, ఓబులపతి ఆవిష్కరించారు.

దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): గత నెల 30 వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం స్టేట్ అడాప్షన్ ఏజెన్సీ ఎస్ఏఏలో చూపిన అన్ని పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి అధికారిని నిర్మలాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన కుందవరం త్యాగరాజు అలియాస్ ఎలీషా (70) అదృశ్యమయ్యాడని ఎస్ఐ తిరుపాల్ బుధవారం తెలిపారు. 2022 అక్టోబరు 10న ఇంటి నుంచి వెళ్లిపోయాడని, బంధువులు, మిత్రులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు కుందవరం స్వామి ప్రతాప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

15న చలో విజయవాడ

బేతంచెర్ల: సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్ర ముగింపు సందర్భంగా నవంబర్ 15న విజయవాడలో జరిగే బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, సంజీవ నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు.

మౌలిక వసతులు కల్పించాలి

డోన్ రూరల్ : డోన్ ఐసీడీఎస్ కార్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌కు అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ, నియోజకవర్గ కార్యదర్శి చాందిని, ఏఐటీయూసీ నాయకులు సుంకయ్య, అబ్బాస్ వినతి పత్రం అందజేశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో టాయిలెట్స్ లేనందు ఇబ్బందిగా ఉందని, ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు చైర్మన్‌ను కోరారు.

కార్తీక వేడుకలకు రుద్రకోడు ముస్తాబు

ఆత్మకూరు: నల్లమల అభయారణ్యంలో అత్యంత ప్రాచీనమైన రుద్రకోడూరు పుణ్యక్షేత్రంలో కార్తీకమాసపు వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 13 వరకు కార్తీకమాస వేడుకలు జరగనున్నాయి. కార్తీకమాసంలో నాలుగు సోమవారాలు శ్రీరుద్రాణి, రుద్రకోటేశ్వర స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు వేకువజామున 4 గంటలకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, విశేషపూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. శ్రీరుద్రాణి మాతకు కుంకుమార్చనలు, అలంకారపూజలు జరపనున్నారు. ప్రతి రోజు కార్తీకదీప మహోత్సవం కూడా నిర్వహించనున్నారు. ఈ నెల 26న కార్తీకపౌర్ణమి సందర్భంగా లక్షదీపోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ప్రతి రోజు భక్తుల సౌకర్యార్థం అన్నదాన ఏర్పాట్లు చేయనున్నారు.